సాక్షి ఖమ్మం

బుధవారం : 27 : మార్చి : 2024



అన్నదాత దగా..

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులు, మిల్లర్లు రైతుల నుంచి తక్కువ ధరకే దోచుకుంటున్నారు. 8లో



బస్టాండ్లలో అధికారుల తనిఖీలు


జిల్లాలో బస్టాండ్లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టిన అధికారులు వివిధ షాపుల యజమానులకు జరిమానా విధించారు. 8లో

గరిష్టం / కనిష్టం

39° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండల ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.



ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.28

సహర్ (గురువారం ఉ॥) 4.44

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఎస్సెస్సీ పరీక్షలు



విద్యార్థి వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్: ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా, అవకతవకలకు జరగకుండా ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు పకడ్బందీ జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని రిక్కాబజార్, ఇందిరానగర్ పాఠశాలల్లో పరీక్షాకేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, ఎండల దృష్ట్యా వైద్యశిబిరంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులతోపాటు, సిబ్బందిని తనిఖీ చేశాకే అనుమతించాలని తెలిపారు.

77మంది గైర్హాజరు

ఎస్సెస్సీ పరీక్షకు మంగళవారం 77మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. మొత్తం 16,779మంది విద్యార్థులకు గాను 16,702మంది హాజరయ్యారని పేర్కొన్నారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్, జిల్లాపరిశీలకుడు, అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పలు కేంద్రాలను తనిఖీ చేశాయని ఆయన తెలిపారు.

నేడు 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు బుధవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు 'నిధి ఆప్‌కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రబీలాల్ దాస్ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు నేలకొండపల్లిలోని మధుకాన్ షుగర్ ఇండస్ట్రీస్‌లో, భద్రాద్రి జిల్లా వాసులు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

భారీ బకాయిదారులపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సంవత్సరం చివరకు వచ్చిన నేపథ్యాన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను భారీగా బకాయి ఉన్న వారిపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. టాప్-20 బకాయిదారులను వ్యక్తిగతంగా కలిసి పన్ను కట్టించాలని తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారి, బిల్ కలెక్టర్ వారికి కేటాయించిన డివిజన్లలో పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. పెద్ద మొత్తంలో పన్నులు చెల్లించాల్సిన వారిని గుర్తించాలని తెలిపారు. ఉదయం 7గంటలకల్లా వసూళ్లు ప్రారంభించాలని పేర్కొన్నారు. ఈమేరకు 30మంది ప్రత్యేక అధికారులు, 30 మంది బిల్ కలెక్టర్లు ఈ ఐదు రోజులు పన్నుల వసూళ్లలోనే నిమగ్నమై వంద శాతం రాబట్టేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రూ.12లక్షల విలువైన సామగ్రి స్వాధీనం

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు వ్యయ పరిశీలన సెల్ నోడల్ అధికారి మురళీధర్ తెలిపారు. ఇప్పటివరకు 127 కేసులు నమోదు చేయగా, రూ.12,61,276 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు పోలీస్ శాఖకు సంబంధించి 54మందిపై 24కేసులు నమోదు చేసి రూ.1,72,505, ఎక్సైజ్ శాఖకు సంబంధించి 103 కేసులు నమోదు చేసి రూ.10,88,771విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే, రూ.50,400 విలువైన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో కారు చిచ్చు



కాంగ్రెస్ పార్టీలో 'కారు'చిచ్చు రగులుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధిక స్థానాలు గెలవడమే కాక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ హవా కొనసాగుతోంది. మరోపక్క ఎన్నికల ముందు వరకు తమ ప్రతాపం చూపించిన బీఆర్ఎస్ నేతలు.. అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో హస్తం గూటికి చేరే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మండల స్థాయి ముఖ్య నేతలు చేయి అందుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు వారిని చేర్చుకోవద్దని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. ఇటీవల కారేపల్లిలో బాహాటంగానే కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించగా... కల్లూరు మండలంలోనూ బీఆర్ఎస్ నేతలను చేర్చుకోవద్దని తీర్మానం చేయడం గమనార్హం. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం

'చేయి' అందుకునేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం

- వారిని చేర్చుకోవద్దంటూ కాంగ్రెస్‌లో తీర్మానాలు
- కారేపల్లి, కల్లూరు మండలాల్లో నేతల అసంతృప్తి
- ముగ్గురు మంత్రులకు వినతులు ఇచ్చేందుకు సిద్ధం
- చేరికలతో పార్టీ బలపడుతుందని ఇంకొందరి వాదన

అధికారం కావాల్సిందే...

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు నువ్వా, నేనా అన్నట్లుగా తలపడగా, పలుచోట్ల ఘర్షణలు కూడా జరిగాయి. చివరకు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆశలు అడియాసలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్య నేతలు పలువురు బీఆర్ఎస్‌ను వీడుతుండడంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోనూ కొందరు నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. మండల స్థాయిలోనూ చేరికలు మొదలుకాగా, మొన్నటి వరకు వారితో తలపడిన కాంగ్రెస్ నేతల నుంచి స్థానికంగా వ్యతిరేకత వస్తోంది. ఈ పరిస్థితితో కొన్ని మండలాల్లో చేరికలు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ఐదేళ్ల పాటు అధికారంలో ఉంటే.. ఆ పార్టీలో చేరి రాజకీయ జీవితాన్ని సాఫీగా కొనసాగిద్దామనుకున్న బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనలు కంటగింపుగా మారాయి. ఎలాగైనా పార్టీలో చేరాలని వారు చేస్తున్న ప్రయత్నాలు స్థానిక కాంగ్రెస్ నేతల వ్యతిరేకతతో బెడిసికొడుతున్నాయి.

ఇదే సరైన సమయం

రాజకీయంగా కలిసొచ్చే అంశాలను బేరీజు వేసుకుని అన్ని స్థాయిల నేతల చేరికలను రాజకీయ పార్టీలు ప్రోత్సహించడం ఆనవాయితీగా వస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో మారే రాజకీయ సమీకరణాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు పార్లమెంట్ ఎన్నికలే అదనుగా భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరితే.. అధికార పార్టీ నేతగా చెలామణి కావొచ్చనే ఉద్దేశంలో వారు ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఖమ్మం లోక్‌సభ స్థానానికి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ సైతం రెండు, మూడు రోజుల్లో ప్రకటించనుంది. అభ్యర్థి ప్రకటన తర్వాత ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

వద్దే.. వద్దు

అధికారంలో ఉన్నప్పుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నేతలను చేర్చుకోవద్దని కారేపల్లి, కల్లూరు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈనెల 19న కారేపల్లిలో ముఖ్యనేతలు సమావేశమై నిరసన తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్ మాట్లాడుతూ దళితబంధు, బీసీ బంధు పేరిట బీఆర్ఎస్ నేతలు కమీషన్లు వసూలు చేశారని.. ఆ తప్పులను కప్పిపుచ్చుకొని, కేసుల నుంచి బయట పడేందుకు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే, కల్లూరులోనూ కాంగ్రెస్ నేతలు సమావేశమై కొత్తగా ఎవరినీ పార్టీలో చేర్చుకోవద్దని తీర్మానించారు. అందరం కలిసి ఉన్న ఈ సమయాన కొత్త వారు వస్తే గ్రూపులు ఏర్పడుతాయని, పార్టీ అభ్యర్థి ఓటమికి పనిచేసిన వారిని చేర్చుకోవద్దని తీర్మానంలో పేర్కొనడం గమనార్హం. బీఆర్ఎస్ నేతలను ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు తీర్మాన ప్రతిని అందించేందుకు సిద్ధమవుతున్నారు.

ముఖ్యనేతలకు సంకటం

ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి జరుగుతున్న వలసలు కొన్నిచోట్ల ముఖ్య నేతలకు తలనొప్పిగా మారాయి. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు చేరికలను ప్రోత్సహిస్తుండగా ఇంకొందరు వ్యతిరేకిస్తున్నారు. ప్రధానంగా గ్రామ, మండల స్థాయిలో తలపడిన నేతలు చేరికలపై భగ్గుమంటున్నారు. ఇటీవల ఖమ్మం నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ నేతల చేరికలను కాంగ్రెస్ శ్రేణులు వ్యతిరేకించగా.. కారేపల్లి, కల్లూరు మండలాల్లో బహిరంగంగానే నిరసన గళం వినిపించారు. ఇతర మండలాల్లో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ నాటికి ఇది తారాస్థాయికి చేరే అవకాశముండేలా కనిపిస్తోంది. అయితే, చేరికలు పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికే కాక, భారీ మెజార్టీ సాధించడానికి ఉపయోగపడతాయనే ఆలోచనలో ఆ పార్టీ ముఖ్య నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ చేరికలు వద్దని స్థానిక నేతలు చేస్తున్న ఆందోళన చర్చనీయాంశంగా మారుతోంది.

సకాలంలో కొనుగోలు కేంద్రాలు

- అవసరమైన చోట ప్రారంభంపై దృష్టి
- ఆదేశించిన సీఎస్ శాంతికుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు చేసేందుకు సకాలంలో కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. యాసంగి ధాన్యం కోతలు మొదలైన చోట కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై దృష్టి సారించాలని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులే కేంద్రాలను ప్రారభించాలని సూచించారు. వరికోతల ఆధారంగా కేంద్రాల ఏర్పాటు షెడ్యూల్ రూపొందించాలని, ఎండల కారణంగా రైతులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పించాలని చెప్పారు. తాగునీటి సరఫరా తదితర అంశాలపై సీఎస్ సూచనలు చేశారు. ఈ వీసీలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఉద్యోగుల ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగుల మొదటి విడత ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ. గౌతమ్ పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 1,459 పోలింగ్ కేంద్రాలకు కావాల్సిన 5,840 మంది ఉద్యోగుల జాబితా రూపొందించడంతో పాటు రిజర్వ్ ఉద్యోగులను కూడా గుర్తించాలని సూచించారు. ఎంపిక చేసిన వారికి సమాచారం ఇచ్చి శిక్షణ ప్రారంభించాలని తెలిపారు.

భూసేకరణలో వేగం పెంచండి

నీటిపారుదల శాఖకు సంబంధించి జిల్లాలో పురోగతిలో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణ వేగంగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, మున్నేరు రిటైనింగ్ వాల్ తదితర ప్రాజెక్టులకు కావాల్సిన భూమి త్వరగా సేకరించాలన్నారు. సీతారామ లింక్ కెనాల్‌కు జూలూరుపాడులో, ఏన్కూరు ఎన్నెస్పీ మెయిన్ కెనాల్ నిర్మాణానికి అదనపు భూసేకరణ విషయమై సర్వే చేయాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, నీటిపారుదల శాఖ సీఈలు విద్యాసాగర్, శ్రీనివాసరెడ్డి, ఎస్‌డీసీ రాజేశ్వరి, డీఆర్వో రాజేశ్వరితో పాటు వివిధ శాఖల అధికారులు జి.గణేష్, చందన్‌కుమార్, శ్రీలత, విజయనిర్మల, మురళీధర్‌రావు, వినోద్, సన్యాసయ్య, హరికిషన్, అరుణ, రాంబాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు బీజేపీ ప్రభంజనం

పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి వినోద్‌రావు



ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో బీజేపీ శ్రేణులు



కూసుమంచిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం/కూసుమంచి: త్వరలో జరిగే ఎన్నికల్లోనూ మోదీ ప్రభంజనంతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఆయనను అభ్యర్థిగా ప్రకటించగా తొలిసారి మంగళవారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా జిల్లా సరిహద్దు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆతర్వాత కూసుమంచిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ర్యాలీగా ఖమ్మం బయలుదేరారు. ఇక ఖమ్మం కాల్వొడ్డు నుంచి పాత బస్టాండ్, వైరారోడ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్, గట్టయ్య సెంటర్ మీదుగా బీజేపీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ కొత్త వ్యక్తినైనా తనకు అవకాశమిచ్చిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు జేపీ.నడ్డా, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణుల సహకారంతో ఖమ్మంపై తొలిసారిగా కాషాయ జెండా ఎగురవేయబోతున్నామని తెలిపారు. ఇందుకు ప్రజలు మద్దతు తెలిపి, మోదీని మరోమారు ప్రధానిగా చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో 400 సీట్లు గెలవడం ఖాయమని, అందులో ఖమ్మం సీటు కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, నున్నా రవికుమార్, నాయకులు అల్లిక అంజయ్య, గోపాలరెడ్డి, నాగేశ్వరరావు, మార్తి ప్రసాద్, సరస్వతి, ప్రభాకరరెడ్డి, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, భద్రం నాయకులు హట్యానాయక్, చావా కిరణ్‌కుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, దామళ్ల ప్రభాకర్, గుండా ఉపేందర్‌రెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీటిని మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్‌కు చేర్చేలా తవ్వుతున్న కాల్వ



భగీరథ ప్రయత్నం...

- పాలేరు రిజర్వాయర్‌లో అడుగంటిన జలాలు
- ప్రాజెక్టుకు నీరు చేర్చేలా కాల్వ తవ్వకం



పాత ప్రాజెక్టులోని మోటార్లకు అదనపు పైపులు బిగిస్తున్న సిబ్బంది

కూసుమంచి: గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని పాలేరు రిజర్వాయర్ అడుగంటడం, ఇప్పట్లో సాగర్ జలాలు విడుదలయ్యే పరిస్థితి లేకపోవడంతో తాగునీటికి తిప్పలు తప్పేలా లేవు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం ఏడు అడుగులకు పడిపోయింది. దీంతో రిజర్వాయర్ ఆధారంగా నిర్మించిన మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటు పాత మంచినీటి పథకాలకు నీరు అందడం లేదు. ఈమేరకు అధికారులు రిజర్వాయర్‌లో దూరంగా ఉన్న నీటిని మిషన్ భగీరథ ప్రాజెక్టుకు అందేలా మంగళవారం కాల్వ తవ్వించారు. మరోపక్క కూసుమంచి మండలానికి నీరందించే పాత ప్రాజెక్టుకు సైతం సరఫరా లేక పంప్‌హౌస్‌లో మోటార్ల పైపులను మరింత కిందకు దించుతున్నారు. దీంతో కొన్నిరోజులైనా తాగునీటి సరఫరా జరుగుతుందని భావిస్తున్నారు. కాగా, ఇక్కడి మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. ఈ నీరు కూడా అడుగంటితే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలు వుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి..

సింగరేణి(కొత్తగూడెం): సాంకేతికతను ఉపయోగించి బొగ్గు ఉత్పత్తి పెంచాలని సింగరేణి సీఎండీ బలరామ్ సూచించారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో డైరెక్టర్ సత్యనారాయణతో కలిసి మంగళవారం ఆయన సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై సూచనలు చేశారు.

అడవితల్లి రక్షణలో ఆడబిడ్డలు

- దూలపల్లి అకాడమీలో శిక్షణ
- 47మందిలో 8మంది మహిళా బీట్ ఆఫీసర్లు
- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ఎఫ్‌బీఓల స్టడీ టూర్



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో శిక్షణ బృందం

సత్తుపల్లిటౌన్: విత్తు నాటడం మొదలు మొక్కను సంరక్షించే వరకు మహిళలకు ఉన్న ఓపిక ఇంకెవరికీ ఉండదు. ఏ ఇంట్లో చూసినా ఈ విషయాన్ని గుర్తించొచ్చు. ఇదేస్ఫూర్తితో మానవాళి మనుగడకు ప్రధాన కారణమైన అడవుల సంరక్షణకు సైతం మహిళలు కదిలొస్తున్నారు. పనివేళలతో సంబంధం లేకుండా అటవీ ఉద్యోగులు నిరంతరం విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇది సవాల్‌తో కూడుకున్నదే అయినా కత్తి మీద సాము లాంటి ఈ ఉద్యోగాల్లోకి అతివలు ఆసక్తిగా వస్తున్నారు. వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, చెట్ల నరికివేతను అడ్డుకోవడంతో పాటు పోడు జరగకుండా పర్యవేక్షించాల్సిన అనేక బాధ్యతలు ఉన్నప్పటికీ అడవితల్లిపై మమకారంతో ఆడబిడ్డలు అటవీ బీట్ ఆఫీసర్ ఉద్యోగాన్ని ఎంచుకుని కదనరంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో స్టడీ టూర్

కొద్దినెలల క్రితం నిర్వహించిన పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా సత్తా చాటిన 47మంది బీట్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. వీరిలో ఎనిమిది మంది మహిళలు ఉండగా.. ప్రస్తుతం హైదరాబాద్ దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యాన బీట్ ఆఫీసర్లు మూడు రోజుల క్రితం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టడీ టూర్‌కు వచ్చారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ అభయారణ్యంలో శిక్షణ అనంతరం ప్రస్తుతం సత్తుపల్లి అర్బన్‌పార్కు, జేవీఆర్ ఓపెన్ కాస్టు, తల్లాడ కనిగిరి గుట్టలు తదితర ప్రాంతాలను సందర్శించి మొక్కలు, వివిధ రకాల జంతువులు, పర్యావరణ అంశాలపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా మహిళా బీట్ అధికారులను 'సాక్షి' పలకరించగా ఈ వృత్తిని ఎంచుకోవడం వెనుక ఉన్న ఆసక్తి, ఇతర అంశాలను వెల్లడించారు.

ఇక్కడ శిక్షణ చాలా బాగుంది..



అకాడమీలో అటవీ సంరక్షణ పాఠాలు నేర్చుకున్నాం. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో స్టడీ టూర్ ఎంతో విజ్ఞానాన్ని అందించింది. ఇక్కడ శిక్షణ చాలా బాగుంది. చాలా అంశాలను క్షేత్రస్థాయిలో వివరించారు. విధుల్లో చేరాక పర్యావరణ పరిరక్షణకు అంకితభావంతో కృషిచేస్తా. – జి.థెరిస్సా, జగిత్యాల

ప్రకృతిలో పని చేయాలని..



ప్రకృతిలో పనిచేయడం ఆనందంగా ఉంటుంది. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణానికి నా వంతు సహకారం అందించాలనేది లక్ష్యం. అందుకే ఈ ఉద్యోగం ఎంచుకున్నా. సత్తుపల్లి పార్కులో చాలారకాల మొక్కలు, వాటి స్వభావాలు తెలుసుకున్నాం. – ఎ.రేఖ, కారేపల్లి

యూనిఫామే మా ధైర్యం..



అడవిలో జంతువులు, స్మగ్లర్ల నుంచి సవాళ్లు ఎదురవుతాయని తెలిసినా యూనిఫామే మా ధైర్యం. సమాజానికి ఉపయోగపడే అడవులను సంరక్షించే ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఒకటి, రెండు కాదు వేల మొక్కలు నాటించి సంరక్షించే అవకాశం మాకు లభిస్తుంది. – జి.శ్రీవల్లి, నర్సాపూర్

అన్ని రంగాల్లో మహిళలు..



ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. అటవీశాఖలో ఉద్యోగం సవాలే అయినా ఇష్టపడి ఎంచుకున్నా. పర్యావరణ సమతుల్యతకు ఉపయోగపడే అటవీ సంరక్షణకు అంకితభావంతో పనిచేస్తా. ప్రకృతి అందాల మధ్య విధులు నిర్వర్తించే అవకాశం దక్కడం అదృష్టం. – బి.పద్మజ, వరంగల్

క్లుప్తంగా

నవమి పనులకు టెండర్లు ఖరారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 17న జరగనున్న శ్రీసీతారాముల కల్యాణం ఏర్పాట్లకు సంబంధించిన టెండర్లను ఆలయ అధికారులు ఖరారు చేశారు. భద్రాచలం, పర్ణశాల పరిధిలోని మొత్తం 19 పనులకు రూ.1.30 కోట్లుగా అంచనా వేయగా, రూ.1,10,82,000కు ఖరారయ్యాయి. వీటిలో కల్యాణ మండపం, పర్ణశాలలో విగ్రహాలకు రంగులు వేయడానికి రూ.7,23,411, షైఉడ్ స్వాగత ద్వారాలు రూ.3,56,450, సెక్టార్ల ప్రవేశ ద్వారాలకు రూ.5,46,840, భద్రాచలం, పర్ణశాలలో చలువ పందిళ్ల నిర్మాణానికి రూ.4,65,433తో పాటు తాత్కాలిక షామియానాలు, కార్పెట్లు, ప్రసాదం కౌంటర్‌లు, ఎల్ఈడీ స్క్రీన్లు, ఇతర పనులకు ఖరారు చేశారు. ఈ పనులు త్వరగా ప్రారంభించి, సకాలంలో పూర్తి చేయాలని ఆలయ అధికారులు టెండర్ దారులను ఆదేశించారు.

గాయపడిన కౌన్సిలర్‌కు కేటీఆర్ ఫోన్

సత్తుపల్లి: సత్తుపల్లిలో సోమవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎస్.కే.చాంద్‌పాషాకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఫోన్ చేశారు. అధైర్యపడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే, దాడిచేసిన అధికార పార్టీ నేతలు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. కాగా, కౌన్సిలర్‌పై దాడి ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కిరణ్ తెలిపారు. అలాగే, తనను దూషించి కొట్టినట్టు దిలీప్ చేసిన ఫిర్యాదుతో చాంద్‌పాషాపైనా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే, కౌన్సిలర్ వ్యక్తిగత గొడవలను పార్టీకి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన కాంగ్రెస్ శ్రేణులపై చేసిన ఆరోపణల్లో నిజం లేదని పార్టీ నాయకులు గాదె చెన్నారావు, ఎం.డీ.కమల్‌పాషా ఓ ప్రకటనలో తెలిపారు.

పగిలిన తాగునీటి పైప్‌లైన్

- 15 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా



పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు

వైరా: వైరా రిజర్వాయర్ నుండి బోడేపూడి సుజల స్రవంతి తాగునీటి పథకానికి నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ మంగళవారం పగిలిపోయింది. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదురుగా రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా చెట్టు తొలగిస్తుండగా జేసీబీ తాకడంతో పైప్‌లైన్ పగిలింది. దీంతో వైరా మండలంలోని 15 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్ మరమ్మతులకు మరో రెండు రోజుల సమయం పడుతుందని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బల్లేపల్లి వద్ద ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం రూరల్ మండలం తనగంపాడుకు చెందిన నల్లా సంజీవరావు (29) సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో తమ బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఎదురుగా కారు ఢీకొట్టింది. ఘటనలో గాయపడిన సంజీవరావును ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు చోరీ

వైరారూరల్: మండలంలోని విప్పలమడకలో ట్రాక్టర్ ట్రక్కు చోరీకి గురైంది. గ్రామానికి చెందిన రైతు దేవభక్తిని అర్జునరావు తన ట్రాక్టర్ ట్రక్కును ఈనెల 22న గ్రామంలోని తన బంధువుల ఖాళీ స్థలంలో నిలిపాడు. మంగళవారం పరిశీలించగా ట్రక్కు లేకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి ఎక్కడ వెతికినా ఫలితం కానరాలేదు. దీంతో రూ.1.20లక్షల విలువైన ట్రక్కు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు మట్టి టిప్పర్లు సీజ్

నేలకొండపల్లి: మండలం కేంద్రంలో మంగళవారం పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రెండు మట్టి టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా వెంచర్లకు మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో టిప్పర్లను వెంబడించి అడ్డుకున్నారు. అనంతరం టిప్పర్లను స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు...

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి శివారు పాలేరు ఏటి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్.ఐ గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం సీజ్ చేశారు. ఈ మేరకు యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,045



రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో తరలిస్తున్న వ్యాపారులు

దళారుల చేతుల్లో అన్నదాత దగా..

ధాన్యం కొనుగోళ్లకు రంగంలోకి వ్యాపారులు

- తక్కువ ధరకే పంట చేజిక్కించుకున్న వైనం
- ఇప్పటికే దిగుబడి రాక రైతాంగం ఆవేదన
- వ్యాపారుల తీరుతో మరింత నష్టం

నేలకొండపల్లి: జిల్లాలో యాసంగి పంట వరి కోతలు ఇటీవలే ప్రారంభమయ్యాయి. కానీ ప్రభుత్వపరంగా నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోగా ఇంకా అధికారులు సమీక్షలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో రైతుల నుంచి వ్యాపారులు అందిన కాడికి దండుకుంటున్నారు. క్వింటాకు రూ.2,300 వేల ధర చెల్లిస్తామని తొలుత వ్యాపారులు నమ్మబలికినా, ప్రభుత్వ కేంద్రాల ఏర్పాటు ఆలస్యమవుతుండడంతో క్వింటా రూ.1,900 నుంచి రూ.2వేల చొప్పునే కొనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ వాతావరణంలో మార్పులతో రైతులు హడావుడిగా ధాన్యం కోయించి వ్యాపారులు, మిల్లర్లకు విక్రయిస్తున్నారు.

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది యాసంగిలో సాగునీటి కొరత కారణంగా రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సాగునీటి కొరతతో గతంలో ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు వచ్చే దిగుబడి ఈ ఏడాది 15 బస్తాలకు మించి రావడం లేదని చెబుతున్నారు. ఎకరానికి దాదాపు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా ఆ మేరకు దిగుబడి రాకపోవడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. దిగుబడి వచ్చిన కొద్దిపాటి పంటనైనా మద్దతు ధరకు అమ్ముకుందామనుకుంటే ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్ల తీరుతో మరింత నష్టం ఎదురవుతోంది.

కేంద్రాల ఏర్పాటు ఎప్పుడు?

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వరి కోతలు మొదలయ్యాయి. ఇటీవల ద్రోణి కారణంగా వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు కోతల్లో వేగం పెంచారు. అయితే, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో వ్యాపారులు దోచుకుంటుండగా... ఆతర్వాత ప్రభుత్వం రంగంలోకి దిగినా రైతులకు జరిగే లాభమేమి ఉండదని చెబుతున్నారు. అయితే, వ్యాపారులు కల్లాల వద్దే కొనుగోలు చేస్తుండగా, వారికి లైసెన్స్ లేదని తెలిసినా అధికారులు కట్టడి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కేంద్రాలు వెంటనే తెరిస్తేనే మేలు



కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. కనీసం పెట్టుబడి వచ్చినా చాలు అనే పరిస్థితిలో ఉన్నాం. కానీ దళారులు రంగంలోకి దిగడంతో నష్టం ఎదురవుతోంది. వారం క్రితంతో పోలిస్తే ఇప్పటికి మరింత ధర తగ్గించారు.

– కాశిబోయిన అయోధ్య, రైతు, సింగారెడ్డిపాలెం

రూ.2 వేలకు అడిగారు...



నాలుగెకరాల్లో సాగు చేసిన వరి ధాన్యం అమ్ముకుందామంటే క్వింటా రూ.2వేలకే అడిగారు. ప్రభుత్వ కేంద్రాలు తెరవకపోవడంతో చేసేదేం లేక అమ్మేందుకు సిద్ధమయ్యాను. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో వచ్చిన ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.

– తీగ రమణయ్య, రైతు రాయగూడెం

జాప్యం సరికాదు..



రైతుల కష్టం దళారుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అసలే సాగునీరు అందక దిగుబడి తగ్గింది. అరకొర పంటనైనా అమ్ముదామంటే కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలి.

– రచ్చా నర్సింహారావు, రైతు సంఘం నాయకుడు, నేలకొండపల్లి



భైరవునిపల్లిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

ఆర్టీసీ బస్టాండ్లలో అధికారుల తనిఖీలు

నిబంధనలు పాటించని షాపుల యజమానులకు జరిమానా

సాక్షి ఎఫెక్ట్..



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో షాపు యజమానికి జరిమానా విధిస్తున్న అధికారులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ బస్టాండ్లలో అధికారులు మంగళవారం ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లలోని షాపుల యజమానులు నిబంధనలు పాటించడం లేదని, నాణ్యత లేని సరుకులు అమ్ముతుండడమే కాక ఎమ్మార్పీకి మించి ధర వసూలు చేస్తున్నారని 'సాక్షి'లో ఈ నెల 25న 'బస్టాండ్లలో అదనపు బాదుడు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు రీజియన్‌లోని బస్టాండ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివరాలను రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న వెల్లడించారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఎనిమిది షాపుల యజమానులకు రూ.10 వేలు, సత్తుపల్లి బస్టాండ్‌లో ఇద్దరికి రూ.1,500, ఇల్లెందు బస్టాండ్‌లో ఇద్దరికి రూ.500, భద్రాచలం బస్టాండ్‌లో ఆరుగురు యజమానులకు రూ.6వేలు జరిమానా విధించి వసూలు చేశామని తెలిపారు. కాగా, బస్టాండ్లలోని షాపుల్లో ఎమ్మార్పీకి మించి ధర వసూలు చేస్తే ప్రయాణికులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇందుకోసం 99592 25979 (ఖమ్మం కొత్త బస్టాండ్), 99592 25965 (ఖమ్మం పాత బస్టాండ్), 99592 25990 (సత్తుపల్లి), 89853 61796 (మణుగూరు), 99592 25982 (కొత్తగూడెం), 73829 25289 (మధిర), 99592 25987 (భద్రాచలం), 99592 25984 (ఇల్లెందు) నంబర్లకు ఫోన్ చేయాలని ఆర్ఎం కోరారు.

రామయ్య సన్నిధిలో మాజీ ఉపరాష్ట్రపతి సతీమణి



పంచవటి కుటీరంలో ఉషానాయుడు, కుటుంబ సభ్యులు

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషానాయుడు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలకగా, ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. అలాగే, దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారిని సైతం ఉషానాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వాగతం పలికిన అధికారులు, అర్చకులు స్వామి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఆ తర్వాత పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాల విశిష్టతను ఆమె తెలుసుకున్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు పోటీలు



ఎంపిక పోటీలను ప్రారంభించిన అధికారులు



బ్యాటరీ టెస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లా పరిధి కిన్నెరసాని బాలుర, కాచనపల్లి బాలికల క్రీడాపాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు తుది దశ ఎంపిక పోటీలు పాల్వంచ మండలం కిన్నెరసాని క్రీడాపాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాల్‌రావు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించనుండగా, 110 మంది విద్యార్థులు హాజరయ్యారని క్రీడల అధికారి తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధికారులు, పీడీలు కొమరం వెంకటనారాయణ, బుగ్గ వెంకటేశ్వర్లు, అన్నం వెంకటేశ్వర్లు, రాంబాబు, కె.వెంకటేశ్వర్లు, నర్సయ్య, రామారావు, మోతీలాల్, కృష్ణ, డి.శిరోమణి, హతీరామ్, రవి, ముత్తయ్య, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలకు తెర

తల్లాడ: తల్లాడ మండలం నారాయణపురంలోని లూర్దుమాతా పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రం కొనసాగుతుండగా, ఇక్కడ సీసీ కెమెరాలకు తెరవేశారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌తో పాటు లూర్దుమాతా ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, లూర్దుమాతా యాజమాన్యం తరగతి గదుల్లో గతంలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఇన్నాళ్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే పరీక్షలు జరగగా.. గత శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ సందర్భంగా ఆరా తీసి ముసుగు కప్పాలని ఆదేశించారు. దీంతో మంగళవారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారి గదుల్లో తప్ప మిగతా కెమెరాలన్నింటికీ కవర్లు కప్పించారు. అయితే, మాస్ కాపీయింగ్ జరుగుతున్నందునే విషయం బయటకు రాకుండా ఇలా చేశారని ఆరోపిస్తున్న కొందరు.. నిబంధనలే కారణమైతే ఇన్నాళ్లు ఏం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సీ.హెచ్.సుదర్శన్‌ను వివరణ కోరగా పాఠశాల యాజమాన్యం పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉన్నందున గదుల్లో సమాచారం బయటకు వెళ్లకుండా సీసీ కెమెరాలకు ప్లాస్టిక్ కవర్లు తొడిగినట్లు తెలిపారు. అంతేతప్ప ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీని నిలువరించేది కమ్యూనిస్టులే..



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ : రాష్ట్రంలో బీజేపీ అడుగుపెట్టకుండా నిలువరించే సత్తా కమ్యూనిస్టులకే ఉందని, ఆ పార్టీ సిట్టింగ్ స్థానాల్లోనూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పాల్వంచలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో బీజేపీయేతర అభ్యర్థుల విజయానికి పని చేయాలని పిలుపునిచ్చారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, తెలంగాణకు అడుగడుగునా అన్యాయం జరిగిందని అన్నారు. ధరలు నానాటికీ పెరుగుతుండడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ధరల అదుపులో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, డి.శేషయ్య, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సాయిబాబు, వాసిరెడ్డి మురళి, జి.వీరస్వామి, దసురు, మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, రాహుల్, పద్మజ, నగేశ్, కొండలరావు, జమలయ్య, లక్ష్మీపతి, కుమారి, హన్మంతరావు, రాము, శ్రీను, వెంకటేశ్వర్లు, హరీశ్ పాల్గొన్నారు.

పత్తి లోడ్ లారీ బోల్తా



శ్రీశ్రీ సర్కిల్‌లో బోల్తా పడిన లారీ

ఖమ్మం అర్బన్: వైరా వైపు నుంచి ఖమ్మం వస్తున్న పత్తి లోడ్ లారీ మంగళవారం రాత్రి ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో బోల్తా పడింది. సర్కిల్ వద్ద లారీ బైపాస్ వైపు తిరుగుతుండగా ఒక్కసారిగా నడిరోడ్డుపై బోల్తా కొట్టడంతో ఇతర వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో సర్కిల్‌లో కాసేపు రాకపోకలకు ఆటంకం ఎదురైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని లారీని పక్కకు తొలగించడంతో పాటు రాకపోకల క్రమబద్ధీకరణలో నిమగ్నమయ్యారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ఐదుగురికి తీవ్ర గాయాలు

బూర్గంపాడు: బూర్గంపాడులోని సులేమాన్‌బజార్‌లో మంగళవారం ఓ వీధి కుక్కకు పిచ్చిలేసి స్వైరవిహారం చేసింది. ఆ వీధిలో ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులతోపాటు నడుచుకుంటూ వస్తున్న వృద్ధుడిని వెంబడించి తీవ్రంగా గాయపరిచింది. వృద్ధుడిని కాపాడేందుకు అటుగా వస్తున్న మరో వ్యక్తిపై కూడా దాడికి పాల్పడింది. స్థానికులు కర్రలతో కుక్కను వెంబడించటంతో అంబేడ్కర్‌కాలనీ వైపునకు వెళ్లి పశువులను కరిచింది. పిచ్చికుక్క స్వైర విహారంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వృద్ధుడు పుట్టి సీతారాములు చేతికి, కాలికి, మూడేళ్ల కంభంపల్లి మహేశ్ బాబుకు ముఖంపై, ఎస్సీకాలనీకి చెందిన మూడేళ్ల కేసుపాక భవ్యశ్రీకి తలకు, రెండున్నరేళ్ల ఇనుపనూరి కావ్యశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీధర గ్రామానికి చెందిన షేక్ కొషర్‌పాషాకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరిని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన పశువులను స్థానిక పశువుల ఆస్పత్రికి తరలించారు.

స్పాట్ నుంచి మినహాయించాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబుపత్రాలు వాల్యూయేషన్ విధులకు అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు, మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్న వారిని మినహాయించాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు డీఈఓ సోమశేఖరశర్మకు మంగళవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు, నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, హుస్సేన్, కట్టా శేఖర్, అమృత్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఈ మేరకు వివరాలను ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించారు. గురువారం ఉదయం 9నుండి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ ఉంటుందని, రాష్ట్ర బార్ కౌన్సిల్ లేదా బార్ అసోసియేషన్ జారీ చేసిన జారీ చేసిన గుర్తింపుకార్డుతో రావాలని సూచించారు. బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉండి ఏఐబీఈ క్వాలిఫై లేదా పాస్ అయిన వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, బార్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేనివారు డిక్లరేషన్ ఇచ్చి ఓటు వేయొచ్చని తెలిపారు. కాగా, అధ్యక్ష స్థానానికి కన్నెబోయిన నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, చిలుకూరి స్వర్ణకుమారి, ప్రధాన కార్యదర్శి పదవికి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, చింతనిప్పు వెంకటేశ్వరరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి కన్నెగంటి గోపి, దేవరకొండ కళ్యాణి పోటీలో ఉన్నారు.

చెక్‌పోస్ట్‌లో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు డీసీపీ ప్రసాదరావు

ముదిగొండ: మండలంలోని వల్లభి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును అదనపు డీసీపీ ప్రసాదరావు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టులోని రికార్డులను పరిశీలించిన ఆయన ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఏపీ నుంచి, తెలంగాణలోకి వచ్చివెళ్లే వాహనాలను తనిఖీ చేయాలని, నగదు, మద్యం రవాణా జరగకుండా కట్టడి చేయాలని సూచించారు. అలాగే, తనిఖీల వివరాలపై ఎస్ఐ నరేష్‌తో సమీక్షించారు.

పురుగు మందు దాడిలో అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి



ధరావత్ పాండ్యా (ఫైల్)

కారేపల్లి: ఇద్దరు వ్యక్తుల ఘర్షణలో పురుగు మందు చల్లగా కళ్లు, నోటిలో పడడంతో అస్వస్థతకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంగళితండా గ్రామానికి చెందిన మాధారం మైన్స్ విశ్రాంతి ఉద్యోగి ధరావత్ పాండ్యా(65)తో పక్కింటి వారు పాతకక్షల దృష్ట్యా ఈనెల 14న గొడవపడ్డారు. ఈ ఘర్షణలో సదరు వ్యక్తులు పాండ్యాపై పురుగుల మందు పోయగా ఆయన నోరు, కళ్లలో పడింది. దీంతో పెద్దలు కలగచేసుకుని ఆయనకు ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో ఈనెల 23వ తేదీన ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, పురుగుల మందు ప్రభావంతో తొలుత పాండ్యాకు ఒక కంటిచూపు పోగా, కిడ్నీలపైనా ప్రభావం పడడంతో మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య బాలి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి పోలీసులు తెలిపారు.